తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) ఉగాది మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# పరోపకారి

—ఎస్.టి. రావు



వీథి అరుగుమీద కుర్చున్న కృష్ణమూర్తిగారు కాగితం, కలం తీసుకుని వ్రాయడానికి ఆరంభించారు.

"ఎవరికండీ లెటరు?" — అడిగారు శాంతమ్మగారు.

"రాంబాబుకి"

"ఒక్కసారి చూడాలని వుందని రాయండి", అంటూ ఆయన్ని సమీపించిందావిడ.

రాంబాబు ప్రసక్తిని అలా వెళ్తూ ఆలకించిన ఐసు బండి రాముడు, "రాంబాబుగారికి ఉత్తరం రాస్తున్నారేటి పంతులుగారు! ... ఆ బాబు నడిగేనని చెప్పండి" అన్నాడు. ఆ వెనుకనే వస్తున్న పనిమనిషిదీ ఇంత ముఖం చేసుకుంటూ "ఆ బాబుని బగమంతుడు సల్లగా సూడాలి. పరోపకారి పాపన్న. ధర్మాత్ముడు ... ఉత్తరం రాయమని సెప్పండి బాబూ" ... అంటూ కృష్ణమూర్తిగారిని సమీపించింది.

కృష్ణమూర్తిగారి ముఖం నవ్వుతో వికసించింది.

"రాస్తున్నానే తల్లీ రాస్తున్నాను. రాంబాబుకి ఉత్తరం రాయకపోతే మీరంతా ఊరుకుంటారా" అన్నారు· శ్రీకారం చుడుతూ.

రాంబాబు పది సంవత్సరాలుగా ఈ ఊళ్ళో ఒక బేంకులో ఫీల్డు ఆఫీసర్‌గా వుండేవాడు. ఏవో కారణాల వలన ఈ మధ్యనే రాజమండ్రి బదిలీ చేయించుకుని వెళ్ళిపోయాడు. ఇక్కడ వుండేటప్పుడు నిరుద్యోగ యువకులకు చాలామందికి అతను ఉద్యోగాలు వేయించాడు. ఎంతోమందికి బేంకు ఋణాలిప్పించాడు. అవసరమయినవారికి చేతనైన ధన సహాయం చేశాడు. అతని వలన ఏదో ఒక సాయం పొందినవారిలో కృష్ణమూర్తిగారు కూడా ఒకరు. అక్కడివారేగాక అతన్ని ఎరిగున్నవారు సైతం అతన్ని ఒక దేవతగా భావించేవారని చెప్పుకోవచ్చు. అతను ఊరు విడిచి వెళ్తున్నప్పుడు పిల్లలూ, పెద్దలూ అందరూ ఒక ఆప్తుడికి దూరమవుతున్నట్లుగా బాధపడుతూ సాగనంపారు.

కృష్ణమూర్తిగారు లెటరు వ్రాయడం పూర్తిచేసే సరికి మరో నలుగురు చేరి వున్నారు ... ఎవరికివారే రాంబాబు క్షేమాన్ని కోరుతూ ఆ ముక్క ఆ ఉత్తరం ముక్కలో రాయమని చెబుతున్నారు. అందులోని ప్రతి వాక్యం అతని పరోపకార బుద్ధిని పొగుడుతూన్నదే! అందరూ అతన్ని పరోపకారాల దేవతగా భావిస్తున్నవారే!

ఒక వారం గడిచాక రాంబాబు నుంచి లెటరు వచ్చింది కృష్ణమూర్తి గారికి. అందరినీ కుశల ప్రశ్నలు అడిగాడు. తను ఊరు విడిచిన తరువాత తలొక్కరి నుండి ఒక్కొక్క ఉత్తరం తనకు వచ్చిందని వ్రాశాడు. అందరూ తనకు కృతజ్ఞతలు చెప్పినవారేనని తెలియచేశాడు. ఇంకా ఇలా రాశాడు "మీ పొగడ్తలూ, మనవారంతా నాకు తెలిపే కృతజ్ఞతలూ, ఇవన్నీ వింటూంటే మీకు ఒక విషయం తెలియచేయాలనిపిస్తున్నది. అది నా స్వభావంలో నాకే అర్థంకాని ఒక భాగం — చిన్నతనంలో స్కూల్లో నాతో చదువుకొనే పిల్లలతో స్నేహంగా వుండేవాణ్ణి. వారికి పుస్తకాలు, చిరుతిళ్ళు కొనుక్కునేందుకు చిల్లర డబ్బులు ఇచ్చేవాణ్ణి. అయితే, వారిలో ఎవరికైనా ఆటల్లో దెబ్బలు తగిలాయని కాని, మాస్టారితో బెత్తం దెబ్బలు తిన్నారని కాని, పరీక్ష తప్పారని కాని నాకు తెలిస్తే - ఎందుకనో- ఆనందం కలిగేది. ఎవడైనా బెంచీ మీద నుంచి క్రిందపడి గుక్క తిప్పుకో లేకుండా ఏడుస్తూంటే ఏదో తృప్తి కలిగేది. 'అయ్యో పాపం' అనిపించాల్సిన క్షణంలో 'మంచి పనయ్యింది' అన్నట్టు అనిపించేది.

ఇతరుల కష్ట వార్తను, శుభవార్తగా భావించే నీచ గుణం నాకెలా అబ్బింది? ఈ హింసా ప్రవృత్తి ఎలా తగ్గుతుంది? ఈ చెడుగుణం అప్పుడు మాత్రమే కాదు, ఇప్పటికీ, ఈనాటికీ నాలో వుంది. అయితే అది ఎంతోసేపు వుండదు. ఒక్క క్షణం మాత్రమే వుంటుంది. ఆ మరుక్షణం నాలోని వివేకం పని చేస్తుంది. 'అయ్యో పాపం' అనిపిస్తుంది. వెంటనే వారికేదో విధంగా సహాయపడతాను. ఇక్కడ మా

ఇంటి ప్రక్క వుండే అబ్బాయి - శ్రీధర్ అని. బాగా చదువుతాడు. కొన్ని పుస్తకాలు కూడా ఉచితంగా ఇచ్చాను. డిగ్రీ పరీక్షలు బాగా రాశాడు. కాని పరీక్ష తప్పింది. ఆ వార్త నా చెవిన పడగానే - ఎందుకో మనసు శాంతించినట్టయింది. నా స్నేహితుడు, బేంకులో కేషియర్ ఒకతను - ఏదో తప్పు చేశాడన్న నేరంపై పోలీసులు కేసు బనాయించారు అతని మీద ... నాకు కచ్చ తీరినట్టనిపించింది. ఇవి కొన్ని ఉదాహరణలు. ఇలాంటివి ఎన్నో!

ఇప్పుడు చెప్పండి. నేను ఇతరులకు ఉపకారం చేసేవాణ్ణా? లేక అపకారం కోరుతున్నవాణ్ణా? పరోపకారినా? పరుల కీడు కోరేవాడినా? ... అయితే ఆ తప్పు దిద్దుకునే ప్రయత్నంలో వున్నానని మీకు నిశ్చయంగా చెబుతున్నాను. ఆ ప్రయత్నంలో భాగమే - ఇతరులకు చేతనైన సాయం చేయడం. అందులోనే కనీసం సంతృప్తి పొందుతున్నాను. అదే నాకు ఆశాదీపం.''

పూర్తిగా చదివిన లేఖను మడతపెడుతూ దీర్ఘంగా నిట్టూర్చారు కృష్ణమూర్తిగారు. — "ప్రక్కవాడు చెడిపోవాలి. దానివల్ల తనకేమీ లాభం లేదు. అయినప్పటికీ, అలా అయితే ఏదో తెలియని తృప్తి, ఆనందం. ఈ లోపం రాంబాబు ఒక్కడిలోనే వుందా? కాదు, తనలోనూ వుంది. తనలోనే కాదు. మనుషులందరిలోనూ వుంటుంది — ఎవరో మహాత్ములైతే తప్ప. అందరిలోనూ ఈ లోపం వున్నప్పటికీ ఎవరూ దానిని గుర్తించరు. గుర్తించినా లక్ష్యపెట్టరు. స్వార్థంలో మంచి పుట్టే ఈ సైతానుని గుర్తించడం జరిగితే, మొదట దాన్ని అంతం చేస్తే - మనుషులకే కాదు, దేశాలకూ, లోకానికీ శాంతి దొరకుతుంది. హింస లేకుండా పోతుంది. రాంబాబులాంటి వారెవరో దానిని గమనిస్తారు. వారి మంచితనంతోనే, మంచి నడవడితోనే దాన్ని అంతం చేస్తారు.''

—రాంబాబు వంటివాని పరిచయం తనకు కలగడం అదృష్టంగా భావించారు కృష్ణమూర్తిగారు. ●

మనసుని డబ్బుతో గాక
ఆత్మతో జయించగలం — ప్లేటో

* * *

వాక్పరుషానికి వశమై తిట్ల కవితల్లే వాడు
అహింసావాది కాలేడు. — మహాత్మాగాంధి

* * *

సజ్జనుడి సంపాదన మేఘం వలె
తిరిగి దానం చేయబడుతుంది. - కాళిదాసు

